క్లుప్తంగా

ఉపాధి మేట్లకు శిక్షణ



దెందులూరు సచివాలయం వద్ద మేట్లకు కొలతలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

దెందులూరు: ఉపాధి హామీ పథకం పనుల్లో కొలతలు కీలకమని, పనుల కేటాయింపు, నమోదు బాధ్యతగా చేయాలని మండల ఏపీఓ దశరథ రామ్‌జీ, ఎంపీడీఓ భీమరాజు అన్నారు. సోమవారం దెందులూరు గ్రామ సచివాలయం వద్ద 50 మంది మేట్లకు కొలతలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కొలతల విషయంలో పర్యవేక్షణ అంకితభావంతో పనిచేయాలన్నారు. మండలంలోని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఉన్నారు.

జాతీయ ఉపాధి పథకం పేదలకు వరం

భీమడోలు: జాతీయ ఉపాధి హామీ పథకం పేదలపాలిట వరమని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ ఉపాధి హామీ పథకం మేట్లకు ఒక రోజు శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీవో కె.పద్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏపీడీ జి.సుధాకర్ హాజరయ్యారు. ఉపాధి హామీ పథకంలో మేట్ల బాధ్యతలు, విధులపై వారికి ఉంగుటూరు ఏపీవో మల్లేశ్వరరావు, ఈసీ దుర్గాప్రసాద్‌లు శిక్షణ అందించారు. ఏపీడీ జి.సుధాకర్ మాట్లాడుతూ శిక్షణ సద్వినియోగం చేసుకుని మేట్లు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలన్నారు. ఏలూరు క్లస్టర్ పరిధిలో ఇప్పటికే ఏలూరు, ముదినేపల్లి, ఖండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని మేట్లకు శిక్షణ పూర్తయ్యిందన్నారు. ఉంగుటూరు, నిడమర్రు, కైకలూరు మండలాల మేట్లకు శిక్షణ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ధనుర్మాస హారతి

దెందులూరు: ధనుర్మాసం పురస్కరించుకుని శ్రీ రామదండు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దెందులూరు విష్ణు ఆలయంలో నవనీత హారతినిచ్చారు. తొలుత భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామదండు మండలి కమిటీ ప్రతినిధి సుగ్గిశెట్టి నూకరాజు మాట్లాడుతూ ఈ నెల 22న ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున 4 గంటలకు నగర సంకీర్తన నిర్వహిస్తారన్నారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 4.05 గంటలకు ఉత్తర ద్వారదర్శనం కల్పించనున్నట్టు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలిపే క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, బీజేపీ నాయకులు

పెదపాడు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గ్రామాల్లో వికసిత్ భారత్ యాత్ర ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు పలువురు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పెదపాడు మండలంలోని కొత్తూరు, నాయుడుగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలను నిర్వహించారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం కేంద్రం పథకాలను తెలిపే క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, సర్పంచ్ కడిమి పద్మావతి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కడగంచి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు- నేడు పథకం పనులను సత్వరమే పూర్తి చేయాలని భీమడోలు ఎంఈవో- 2 అయిన పర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. పాతూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. చిన్నారుల్లో విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో నాడు-నేడు ఫేజ్ 2 పనుల ప్రగతిని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం నిర్మలకుమారి పాల్గొన్నారు.

ఓట్ల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ

పెదవేగి : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓట్ల నమోదులో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు ఎన్నికల పరిశీలకులు బి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పెదవేగి మండలంలోని నడిపల్లి, ముత్తనవీడులోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటు నమోదును పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. నూజివీడు సబ్ కలెక్టరు ఆదర్శ రాజేంద్రన్, పెదవేగి తహసీల్దార్ ఎస్.నాగరాజు, దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు వి.రామారావు, పోలింగ్ బూత్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్బారాయుని కల్యాణోత్సవం

- వాడవాడలా వైభవంగా షష్ఠి ఉత్సవాలు
- సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు

భీమడోలు: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారం వాడవాడలా ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు సహజసిద్ధంగా ఉన్న పుట్టల వద్ద సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసారు. మండలంలోని గుండుగొలను, సాయన్నపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో, భీమడోలు, పోలసానిపల్లి, పూళ్ల, అంబర్‌పేట తదితర గ్రామాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. గుండుగొలనులో స్వయంభూగా వెలిసిన శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్ బర్ల రమణమూర్తి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 62వ షష్ఠి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని సహజసిద్ధంగా ఉన్న పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు.

పత్తేపురంలో షష్ఠి ఉత్సవాల సందడి

నిడమర్రు: పత్తేపురంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 61వ కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభించారు. నడింపల్లి రామరాజు, మహాలక్ష్మి దంపతులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు అనంతరం కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి ఆలయ ప్రాంగణం, గ్రామ చెరువు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ప్రత్యేక అకర్షణగా నిలిచింది. ఈనెల 22 వరకూ 5 రోజులు పాటు ఈ కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



ఉంగుటూరు: ఎమ్మెల్యే వాసుబాబును సత్కరిస్తున్న కైకరం ఆలయ కమిటీ సభ్యులు



భీమడోలు: సహజ సిద్ధమైన పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు



భీమడోలు: గుండుగొలనులో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



నిడమర్రు: పత్తేపురంలో ప్రత్యేక అలంకరణలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



ఉంగుటూరు: బాదంపూడిలోని దత్త పాలసుబ్రహ్మణ్యం

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి

గణపవరం: గణపవరంలోని వల్లీ దేవసేనసమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో తెల్లవారుజామునే భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మికవేత్త ఆర్‌వీఎస్ రాజు, అన్నపూర్ణ దంపతులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఎ.గోపవరంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. బువ్వనపల్లిలోని వడలమ్మ ఆలయం ఆవరణలో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. కమిటి ఛైర్మన్ సంకు పుల్లయ్య ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. మండలంలోని పలుగ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు వైభవంగా



గణపవరం: సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

విద్యుత్ ఆదాతోనే భవిష్యత్తులో వెలుగులు



భీమడోలులో విద్యుత్ పొదుపుపై కళాజాత బృందం ప్రదర్శన, చిత్రంలో విద్యుత్‌శాఖ అధికారులు

భీమడోలు: విద్యుత్ ఆదాతో భవిష్యత్తు తరాలకు వెలుగులు నిండుతాయని భీమడోలు ఏఈ రామస్వామి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో భీమడోలు జంక్షన్, గాంధీబొమ్మ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ ఆదాపై అవగాహన సదస్సును నిర్వహించారు. కళాజాత బృందాలతో బుర్ర కథను వినిపించారు. విద్యుత్ పొదుపు చర్యలను వివరిస్తూ గ్రామ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏఈ పి.రామస్వామి మాట్లాడుతూ విద్యుత్ పొదుపు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ ఆదా చేద్దాం .. భవిష్యత్తు తరాలకు వెలుగులు అందిద్దాం అనే నినాదంతో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. పొదుపు వారోత్సవాల్లో భాగంగా పాఠశాలల బాలబాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ఎం.నాగులపల్లి విద్యుత్ సెక్షన్ల సిబ్బంది సిద్దిక్, జే.సత్యనారాయణ, అప్పన్న, ఏ.నాగేశ్వరరావు, బాలు పాల్గొన్నారు.

చిన్నారుల్లో గణిత నైపుణ్యాల పరిశీలన

భీమడోలు: విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా చిన్నారులు అన్ని సబ్జెక్టుల్లో చురుగ్గా ఉంటారని జే.పాల్ సంస్థ ప్రతినిధులు నర్మదా, వీర్రాజు అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జే.పాల్ స్వచ్ఛంద సంస్థ పని చేస్తూ ఉపాధ్యాయులకు గణితంలో మెలకువలు, నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గుండుగొలను- 1 పాఠశాలకు చెందిన టీచర్ ఎం.దీప్తి వారి నుంచి శిక్షణ పొందారు. ఒకటో తరగతి విద్యార్థులకు గణితంపై పట్టు సాధించేలా సంబంధిత టీచర్ అందిస్తున్న బోధనా విధానం, వారిలో నైపుణ్యాల ప్రగతిని పరిశీలించేందుకు ఇద్దరు సభ్యుల నర్మదా, వీర్రాజు బృందం గుండుగొలను పాఠశాలను సోమవారం సందర్శించింది. చిన్నారులతో ముచ్చటించి, వారి ప్రగతిని పరిశీలించారు. హెచ్‌ఎం పాశం పాండురంగారావు ఈ శిక్షణ ద్వారా చిన్నారులు అన్ని సబ్జెక్టుల్లో ప్రగతి సాధించేందుకు చాలా ఉపయుక్తంగా ఉందని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.



గుండుగొలను-1 పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జే.పాల్ సంస్థ రాష్ట్ర ప్రతినిధి బృందం

డాక్టర్ ఆదిరెడ్డి సేవలు చిరస్మరణీయం

ఉంగుటూరు: డాక్టర్ గోపు ఆదిరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని పలువురు వక్తలు అన్నారు. సోమవారం నారాయణపురం లయన్స్ కల్యాణ మండపంలో డాక్టర్ ఆదిరెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన మాజీ గవర్నరు లయన్ ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్ ఆదిరెడ్డి అందరివాడుగా పేరుతెచ్చుకున్నారని అన్నారు. ఆలిండియా వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి మాట్లాడుతూ డాక్టర్ ఆదిరెడ్డి క్లబ్ ఏర్పాటుకు, లయన్స్ కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావుబాబ్జి, విశ్రాంత జడ్జి బొమ్మిడి అప్పారావు, లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంటు గుణ్ణం బుల్లఅబ్బాయి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాలమాలతీరాణి, లోక్ సత్తా నాయకుడు సాగిరాజు జానికిరామరాజు, డిగ్రికళాశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం డాక్టర్ ఆదిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నారాయణపురంలో డాక్టర్ ఆదిరెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

పాస్టర్ల ఆధ్యాత్మిక సేవలు స్ఫూర్తిదాయకం

దెందులూరు: ఏలూరు ఆర్‌సీఎం పీఠంలోని ఉపదేశీయుల ఆధ్యాత్మిక సేవలు స్ఫూర్తిదాయకమని అనునిత్యం ఆధ్యాత్మిక చింతనలో వారి సేవలు అభినందనీయమని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. సోమవారం సెయింట్ జాన్స్ విద్యా సంస్థలో ఏలూరు పీఠం వికారల్ జనరల్ డాక్టర్ ఫాదర్ పీ. బాల ఆధ్వర్యంలో ఏలూరు పీఠంలోని రెండు జిల్లాల్లో ఉపదేశీయులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. మరింత ఆధ్యాత్మిక అభివృద్ధికి సేవలందించాలని పీఠాధిపతి ఉపదేశీయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠం ప్రొక్యూరేటర్ ఫాదర్ రాజు, ఫాదర్ మోజెస్, తంగెళ్ళమూడి ఫాదర్ బాబు జార్జి, ఫాదర్ చైతన్య, రెండు జిల్లాల పాస్టర్లు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు

నేడు గుండుగొలనులో ‘గడపగడపకు’

భీమడోలు: గుండుగొలను గ్రామ పంచాయతీలోని సచివాలయం 1 పరిధిలో ఈనెల 19వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు భీమడోలు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమవారం రాత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని వారు కోరారు.

సేంద్రియ సాగుతో ప్రజల ఆరోగ్యానికి రక్ష

గణపవరం: అన్ని పంటల్లో సేంద్రియ వ్యవసాయ విధానాలను అవలంబించాలని, అదే అందరి ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం అప్పనపేటలో వైఎస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సర్పంచ్ నూకారపు సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈసభలో కలెక్టరు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికార్లు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునని, తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. రైతులు తమ సొంత పద్ధతులు అనుసరించడంతో 30 నుంచి 40 శాతం పెట్టుబడులు పెరిగిపోయాయన్నారు. రైతుల వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా సాగులో మెళుకువలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చునన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన కారణంగా అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, మరికొందరు రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా మారారని తెలిపారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రైతులకు అండగా నిలిచి వారి సంక్షమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారని అన్నారు. ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో రైతులకు మార్గదర్శనం చేస్తూ వ్యవసాయాన్ని పరిపుష్టి చేసిందన్నారు. వైఎస్ జగన్ రైతులకు అండగా నిలిచారన్నారు. రైతులంతా సేంద్రియ వ్యసాయం పైపు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చి వారి అనుమానాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా నాణ్యమైన ధాన్యం ఉత్పత్తులు సాధించినందుకు రైతులను అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో యర్రంశెట్టి ప్రసాద్, ఎంపీపీ అర్ధవరం రాము, సొసైటీ అధ్యక్షుడు మురళీరాజు, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కైగాల శ్రీనివాస్, ఎంపీటీసీ సత్యనారాయణ, రైతు శిక్షణకేంద్రం ఏవో బాలనాగేశ్వరమ్మ పాల్గొన్నారు.



వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టరు ప్రశాంతి, వేదికపై వాసుబాబు

దేశంలోనే మహోన్నతమైన పథకం ఆరోగ్యశ్రీ

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం దేశంలోనే మహోన్నతమైనదని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అభివర్ణించారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవలు రూ. 25 లక్షల వరకు పరిధిని పెంచడం హర్షణీయమన్నారు. దివంగత నేత వైఎస్సార్ బాటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే క్యాన్సర్‌తో పాటు ఎన్నో వ్యాధులను ఈ పథకంలో చేర్చడమే కాకుండా పరిధిమితిని రూ.25 లక్షలకు పెంచడం ప్రతి ఒక్కరికీ అభయహస్తంలా ఆరోగ్యశ్రీ పథకం మారిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆరోగ్యశ్రీ పథకం నగదు పరిమితి పెంపుదలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

గ్రంథపాలకుడు వెంకటేశ్వరరావుకు సత్కారం

దెందులూరు: దెందులూరు ఉన్నత పాఠశాల గ్రంథపాలకుడు గుళ్ళపూడి వెంకటేశ్వరరావు 8 ఏళ్ల విశేష సేవలందించారని హెచ్‌ఎం పసుమర్తి వెంకటరామశర్మ అన్నారు. వెంకటేశ్వరరావు బదిలీపై తాడేపల్లిగూడెం ఉన్నత పాఠశాలకు వెళ్లిన సందర్భంగా ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, సుధీర్, ప్రభుపాల్, మధుసూదనరావు, సుభాషిణి, నటరాజ్, వరలక్ష్మి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

దాత పుల్లయ్య సేవలు అభినందనీయం

నిడమర్రు: బువ్వనపల్లి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్, దాత సంకు పుల్లయ్య సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర ఆలయానికి రూ.20 లక్షలు విరాళం అందించి ఆలయ అభివృద్ధికి కృషి చేసిన సంకు పుల్లయ్యను ఎమ్మెల్యే వాసుబాబు ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు కొనసాగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పంజా రాంబాబు, అల్లుమోలు ప్రసాదు, సంకు పండు, అల్లుమోలు అంతిర్వేది, కోడూరి మణి, ఎర్ర నాని, ఆలయ అర్చకులు వేదాంతం హనుమంతాచార్యులు తదితరులున్నారు.



సంకు పుల్లయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

జాతీయ క్రీడలకు ఎంపిక

పెదపాడు: జాతీయ క్రీడలకు కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కే భీమయ్య తెలిపారు.విద్యార్థిని మాయ సాత్విక, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నరసారావుపేటలో నిర్వహించిన అండర్-17 విభాగంలో బంగారు పతకాన్ని సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జాతీయ క్రీడలకు ఎంపికైన సాత్వికను ఉపాధ్యాయులతోపాటు, సర్పంచ్ వత్రపు విష్ణు తులసి, ఎంపీటీసీ కంభం నాగరాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నలకుర్తి శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మజయలక్ష్మి అభినందించారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

పెదపాడు: విద్యార్థులు పాఠశాల దశ నుండే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గత సంవత్సరం 6,7,8,9, 10 తరగతుల్లో ప్రథమ స్థానం పొందిన వారికి రూ.1000, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.500 అందించారు. వీటితో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపిక, పెద్ద బాలశిక్ష అందించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు కురెళ్ల సుభాచారి, కార్యదర్శి కల్లేపల్లి నారాయణరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నీతి, నిజాయతీతో రాజకీయం చేశాం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- ఉత్సాహంగా ప్రజా ఆశీర్వాద యాత్ర

పెదవేగి : రాయన్నపాలెంలో ఐదవ రోజు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రజా ఆశీర్వాద యాత్ర ఘనంగా ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న జనం ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేశారు. రాయన్నపాలెంలో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముందుగా రూ.24.60 లక్షల నిధులతో నిర్మించిన ఆర్‌బీకేను ప్రారంభించి, జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన బడి నాడు-నేడు ఫేజ్ 2లో రూ.1.85 కోట్ల నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలలో మన బడి నాడు-నేడు ఫేజ్ 1లో రూ.18.78 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న మల్టీ పర్పస్ యాక్టివిటీ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొని పథకాల వివరాల శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాట్నాలకుంటకు చేరుకున్న ఎమ్మెల్యే బీఆర్. అంబేద్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరోగ్యశ్రీ సేవలపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సూర్యారావుపేట మీదుగా పెదవేగి చేరుకుని తురాయి సెంటర్‌లో భగీరథ ప్రాజెక్ట్ శిలఫలకాన్ని ఆవిష్కరించారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి నీతి నిజాయతీతో రాజకీయం చేస్తూ, ప్రజా సేవకు అంకితమయ్యానని తెలిపారు. పెదవేగి మండలంలో తాగునీటి కొరతపై సీఎం వైఎస్ జగన్‌దృష్టికి తీసుకువెళ్లి గోదావరి జలాలలను తీసుకువచ్చే బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. మండలంలోని 50 వేల మందికి ఒక్కొక్కరికీ రోజుకు 55 లీటర్ల గోదావరి నీటిని అందిస్తామన్నారు. మొదటి దశలోనే రూ.61 కోట్లు కేటాయించి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద వేగిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం వచ్చాక రూ. 34 కోట్లు ఖర్చు చేసినట్టు అబ్బయ్యచౌదరి వివరించారు. నాడు-నేడు పథకంలో మూడు పాఠశాలల అభివృద్ధికి రూ.1.34 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. గ్రామంలో 7 ఎకరాల పొలం కొని, మొదటి విడతగా 282 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్టు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, కొఠారు రామచంద్రరావు, బీసీ సెల్ జిల్లా అధ్య క్షుడు ఘంటా ప్రసాద్, ఎంపీపీ తాతా రమ్య, సొసైటీ ఛైర్‌పర్సన్లు పాల డుగు పెదబాబు, పెనుమాక వెంకట సుబ్బారావు, చిలుకూరి ప్రసాద్, సర్పంచ్‌లు పర్వతనేని రమాదేవి, జెట్టి వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు మట్టా రాగిణి, దేవళ్ళరాజు రాధిక రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.